సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

విద్యావ్యవస్థ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

రామగిరి, మార్చి 24 : రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. యూటీఎఫ్ వ్యవస్థాపకుడు, దివంగత అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో 'ఉపాధ్యాయ ఉద్యమం-నేటి సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు పాఠశాల విద్యను నిర్లక్ష్యం చేయడంతో ప్రమాణాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం, విద్యాశాఖ వీటిపై దృష్టి కేంద్రీకరించి మెరుగైన విద్యా వ్యాప్తికి పునః సమీక్షలు చేసి మార్పులు తేవాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నూతన విద్యా విధానం విద్యను కాషాయీకరించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి తరం విద్యార్థులకు చరిత్రను తెలిపి వారిలో దేశ ఔన్నత్యం చాటేలా చూడాలన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించాలని విద్యాశాఖను కోరారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోలీని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, మార్చి 24 : ప్రకృతి సిద్ధ రంగులతో హోలీని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలసి హోలీ జరుపుకోవాలన్నారు. హోలీ సందర్భంగా ఒకరిపై మరొకరు చల్లుకునేది రంగులు కాదని, అనురాగం, ఆప్యాయతలు కలిపిన పన్నీటి జల్లులు అని ఆయన ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మాడ్గులపల్లి : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మకల్ పరిధిలో గల గణపతివారిగూడెంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, మాజీ సర్పంచ్ మారుతి వెంకట్‌రెడ్డి, నూకపంగల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మణికంఠ ఆలయ అభివృద్ధికి కృషి : ఎంపీపీ

ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ముత్తి లింగయ్య

కట్టంగూర్, మార్చి 24 : మండల కేంద్రంలోని సాయి మణికంఠ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మన్, ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. ఆదివారం ఆలయ కార్యాలయంలో జరిగిన ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో పుష్కర కాలం క్రితమే అయ్యప్ప, సాయిబాబాలను ప్రతిష్ఠించి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. ఆలయం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సైతం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలో కట్టంగూర్ బస్టాప్ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలయ అధ్యక్షుడు పోగుల నర్సింహ, గురుస్వామి వంగూరి లక్ష్మయ్య, కోశాధికారి గుడిపాడి శివప్రసాద్, సభ్యుడు గుడిపాటి పండరి, అర్చకుడు కొటారి సత్యనారాయణశర్మ, కృష్ణమూర్తి, శివశంకర్, మల్లికార్జున్, వెంకన్న, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మాసాగర్, మాజీ సర్పంచ్ జెల్లా అంజమ్మ, ద్దైద రవీందర్ పాల్గొన్నారు.

అలరించిన గ్రాడ్యుయేషన్ డే

గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పాఠశాల కరస్పాండెంట్

రామగిరి, మార్చి 24 : పట్టణంలోని అక్షర స్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే అలరించింది. ముఖ్య అతిథిగా నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగొని రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ పోలోజు నాగేందర్, ప్రధానోపాధ్యాయురాలు అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

PLOT FOR SALE
★హైదరాబాద్ @ రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రక్కనే హైవే ఫేసింగ్‌కు & ఇళ్ల మధ్య HMDA వెంచర్‌లో వెంటనే ఇళ్లు కట్టుకునే ప్లాట్లు. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. Ph: 9666607146.
NT-2326

PLOT FOR SALE
★5th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్ విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4 లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్రచందనం & 40 రకాల పండ్లమొక్కలతో 10 గుంటల ప్లాట్లు కలవు. గజం: 2,199/- మాత్రమే. సంప్ర: 9346363436.
NT-327974

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777106 | చౌటుప్పల్ : 9182777638

పరిశోధనలకు ప్రాధాన్యం

- ఎంజీయూలో నాణ్యతతో కూడిన పీహెచ్‌డీ
- ఇతర యూనివర్సిటీలకు దీటుగా ముందడుగు
- ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పీహెచ్‌డీ కోసం వస్తున్న విద్యార్థులు
- ఇప్పటికే 21 మందికి పీహెచ్‌డీ అవార్డులు
- ఈనెల 16తో ముగిసిన దరఖాస్తుల గడువు

రామగిరి, మార్చి 24 : ఉన్నత విద్యా వ్యాప్తియే లక్ష్యంగా ఏర్పాటైన నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పదిహేను ఏండ్లుగా మారుతున్న కాలనికి అనుగుణంగా అడుగులు వేస్తూ పరిశోధనలకు వేదికగా మారింది. ఇతర యూనివర్సిటీలకు దీటుగా పీహెచ్‌డీ నోటిఫికేషన్స్ ఇవ్వడంతో విద్యతో పాటు పరిశోధనల్లోనూ ముందడుగు వేయడంతో ఆగస్టు 2019లో కెమిస్ట్రీ విభాగంలో ఒక పరిశోధనా విద్యార్థి తొలి పీహెచ్‌డీ పట్టా అందుకోగా, 2023 నవంబర్‌లో నిర్వహించిన కాన్వకేషన్‌లో 17మంది పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. ఆ తర్వాత మరో నాలుగు పరిశోధనలు అవార్డు కాగా, తాజాగా మరో ఇద్దరు పరిశోధనా విద్యార్థులు వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ పరిశోధనలను వర్సిటీ పరీక్షల విభాగానికి సమర్పించగా ఫలితాలు వెల్లడికానున్నాయి. అయితే 2022సంవత్సరంలో పీహెచ్‌డీ పూర్తిచేసిన నల్లగొండ జిల్లా పాముగుండ్ల వాసి జాన్‌పాల్ కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం పొందడం హర్షణీయం. ఎంజీయూలో నాణ్యతతో కూడిన పరిశోధనలు జరుగుతున్నాయడానికి ఇదే నిదర్శనం. మరోవైపు 2022-23, 2023-24లో ఏడు కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు నోటిఫికేషన్ జారీచేయగా ఈ నెల 16తో గడువు ముగిసింది. దరఖాస్తు చేసిన వారికి త్వరలో పరీక్ష నిర్వహించి మెరిట్, ప్రతిభ ఆధారంగా ఆయా కోర్సుల్లో అడ్మిషన్స్ కల్పించనున్నారు. కాగా ఇప్పటికే వివిధ డిపార్ట్‌మెంట్లలో ఇంకా 138 మంది పరిశోధనా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

న్యాక్ గ్రేడ్ పెంపులో పరిశోధనలే కీలకం..

నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపుతో యూనివర్సిటీల్లోని పరిశోధనలు, పీహెచ్‌డీ అవార్డుల ప్రదానోత్సవానికి ప్రధాన గుర్తింపు ఉంటుంది. అయితే ఎంజీయూలో పీహెచ్‌డీ అవార్డులను అందించడంలో త్వరలో జరిగే న్యాక్‌లో ప్రత్యేక మార్కులతో ప్రస్తుతం ఉన్న న్యాక్ హోదా పెరిగే అవకాశం ఉంది. అలాగే ఇంకా పరిశోధనా విద్యార్థులకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

ఇప్పటికే 21 మందికి పీహెచ్‌డీ పట్టాలు...

2019 నుంచి ఇప్పటి వరకు వివిధ విభాగాల్లో 21 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఇంకా ఇద్దరు విద్యార్థులు తమ పరిశోధనలు సమర్పించి ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. ప్రస్తుత వీసీ గోపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వర్సిటీ అభివృద్ధికి బాటలు వేస్తూ పరిశోధనలకు ప్రాధాన్యం కల్పించించడంతో ఎంజీయూ ఇతర వర్సిటీలకు దీటుగా నిలిచింది.

ముగిసిన దరఖాస్తులు...

గతంలో ఎంజీయూలో నెట్, సెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరానికి యూజీసీ నూతన నిబంధనల మేరకు ఏడు కోర్సుల్లో 78 మందికి పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించడానికి ఎంజీయూ నోటిఫికేషన్ జారీ చేసింది.

ఈ నెల 16తో దరఖాస్తుల గడువు ముగిసింది. త్వరలోనే దరఖాస్తుదారులకు అర్హత పరీక్ష నిర్వహించి ప్రతిభ, మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

ఆధునిక అంశాల్లో పరిశోధనలకు అవకాశం

కాలనుగుణంగా మార్పులను దృష్టిలో పెట్టుకొని పరిశోధనలకు అవకాశం కల్పిస్తున్నాం. రాష్ట్రంలో మిగిలిన యూనివర్సిటీలకు దీటుగా ఎంజీయూలో ఎనిమిది డిపార్ట్‌మెంట్లలో పీహెచ్‌డీ నోటిఫికేషన్స్ జారీచేసి నెట్, సెట్ అర్హత సాధించిన వారికి మెరిట్, ఇతర క్వాలిఫికేషన్స్ పరిగణలోకి తీసుకుని అడ్మిషన్లు కల్పిస్తున్నాం. యూజీసీ నూతన నిబంధనల మేరకు 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో 7 కోర్సులో పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం పరీక్ష నిర్వహించి భర్తీ చేస్తాం. త్వరలోనే పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్లు కల్పిస్తాం.

– ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, వీసీ, ఎంజీయూ

త్వరలోనే ప్రవేశ పరీక్ష

వీసీ, రిజిస్ట్రార్ సూచనలతో అందించే నోటిఫికేషన్స్‌తో ఇప్పటి వరకు ఎంజీయూలో 136 మంది విద్యార్థులు తమ పరిశోధనలు సాగిస్తున్నారు. కామర్స్, ఎకానామిక్స్, మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో విద్యార్థులు పర్యవేక్షకుల సూచనలతో రెగ్యులర్, పార్ట్‌టైంలో పరిశోధనలు చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలతో పరిశోధనలు సాగేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. 2022-23, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల దరఖాస్తు గడువు ముగిసింది. త్వరలోనే ప్రవేశ(అర్హత) పరీక్ష నిర్వహించేందకు సన్నద్ధమవుతున్నాం.

– ప్రొఫెసర్ ఆకుల రవి, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఎంజీయూ

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

- భర్తను హత్య చేయించిన భార్య
- భార్యతోపాటు నలుగురు నిందితుల అరెస్టు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివరాంరెడ్డి

నీలగిరి, మార్చి 24 : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడు, కిరాయి హంతకులతో కలిసి భర్తను హత్య చేసిన భార్యతోపాటు నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి కారు, రెండు బైక్‌లు, రెండు తులాల బంగారు నగలు, 20 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిప్పర్తి మండలం దుప్పలపల్లికి చెందిన వనం ఈశ్వర్‌కు సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన దాసరి నవ్యకు 2015లో వివాహం జరిగింది. వీరికి పాప, బాబు జన్మించారు. ఈక్రమంలో ఇంటి పక్కన వైన్‌షాపులో పని చేస్తున్న కారింగ్ సతీశ్‌తో పరిచయం ఏరపడి అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. దాంతో భార్యాభర్తల నడుమ తరచూ గొడవలు జరిగేవి. ఈ విషయంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా నవ్య, సతీశ్ తమ సంబంధాన్ని మానుకోకపోవడం, అందుకు అడ్డుగా ఉన్న ఈశ్వర్‌ను తొలగించుకోవాలని నవ్య సతీశ్‌ను కోరింది. దాంతో సతీశ్ తన దూరపు బంధువైన నక్క వీరస్వామి సాయం కోరాడు. వీరస్వామి తనకు తెలిసిన వారితో కలిసి ఈశ్వర్‌ను చంపేందుకు రూ.2 లక్షలకు ఒప్పందం చేసుకోగా విషయం నవ్యకు చెప్పడంతో అడ్వాన్స్‌గా తన రెండు తులాల బంగారు తాడును అప్పగించింది. వీరస్వామి తనకు తెలిసిన ధనావత్ హనుమా నాయక్, ధనావత్ సాయితో కలిసి ఈశ్వర్‌ను చంపేందుకు రూ.40 వేలకు సుఫారీ మాట్లాడుకున్నారు. వీరంతా కలిసి ఈశ్వర్‌ను చంపేందుకు ప్లాన్ వేశారు. ఈ నెల 16న ఈశ్వర్‌న తన భార్యా పిల్లలతో కలిసి బైక్‌పై తన అత్తగారి ఊరైన టేకుమట్లకు వెళ్తుండగా వీరస్వామి, సతీశ్ వారి బండి వెనుకాల ఫాలో అయ్యారు. ఈశ్వర్ బండి నకిరేకల్ దాటిన తరువాత ఆగిపోవడంతో భార్యాపిల్లలను ఆటోలో పంపిచాడు. వెనకాలే వెళ్తున్న సతీశ్ వీరస్వామిని దూరంగా దించి హత్య చేయాల్సిన ఈశ్వర్‌ను చూపించి వెళ్లిపోయాడు. అనంతరం వీరస్వామి ఈశ్వర్ దగ్గరకు వెళ్లి బండి బాగు చేస్తానని పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి ఈశ్వర్‌కు నకిరేకల్ వైన్స్‌లో బీర్ తాపించి ఫోన్ నంబర్ తీసుకున్నాడు. అదే రోజు రాత్రి ఈశ్వర్ తన ఇంటికి వెళ్లి పడుకున్నాడు. మరుసటి రోజు సతీశ్, వీరస్వామి సూర్యాపేటకు వెళ్లి అద్దె కారులో కట్టంగూర్‌కు వచ్చి నల్లగొండకు వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకుని నకిరేకల్‌కు వెళ్లారు. అక్కడ సాయి, హనుమలను కారులో ఎక్కించుకుని దండెంపల్లి వద్దకు తీసుకొచ్చి కారులోనే ఈశ్వర్ మెడకు తాడు బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని దుప్పలపల్లిలోని వ్యవసాయ బావిలో పడేసి వెళ్లిపోయారు. దీనిపై విచారణ చేపట్టిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ రాజు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

చిట్యాల, మార్చి 24 : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుంటోజు శ్రీనివాస్ వదిన లక్ష్మి కూతురు వివాహానికి గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ప్రకటించారు. సాయాన్ని గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పల్లపు బుద్ధుడుతో కలిసి ఆదివారం లక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జన్నపాల శ్రీను, వెంకన్న, నర్సింహ, బొలుగూరి సైదులు పాల్గొన్నారు.

28 నుంచి త్రిపురారంలో భజన సంకీర్తన

త్రిపురారం, మార్చి 24 : ఈ నెల 28, 29, 30 తేదీల్లో మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో 72 గంటల నిరంతర భజన సంకీర్తన నిర్వహించనున్నట్లు శ్రీరామ కరసేవకుడు కర్ర జానకిరాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని భజన గ్రూప్‌లను ఆహ్వానించామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

28 నుంచి శివాలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

శాలిగౌరారం, మార్చి 24 : మండలంలోని మనిమద్దెలో వెలసిన పురాతన శివాలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 28న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, యాగశాల ప్రవేశం, మంత్ర హోమములు, 29న మూల మంత్రజపము, రుద్రహోమం, మంత్రపుష్పము, 30న విగ్రహ ప్రతిష్ఠాపనము, అష్టదిగ్బంధ ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు వివరించారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

చందంపేట(దేవరకొండ), మార్చి 24 : అదుపు తప్పిన కారు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం దేవరకొండ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మీదుగా వైజాగ్‌కాలనీకి వెళ్తున్న కారు అతివేగంగా వెళ్తూ దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులోని మార్కెట్ యార్డు వద్ద ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్న నెమలిపూర్‌తండాకు చెందిన వీరి(70)అనే వృద్ధ మహిళను ఢీకొట్టింది. దాంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నార్కట్‌పల్లి, మార్చి 24 : రెండ్రోజుల క్రితం అదృశ్యమైన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని ఔరవాణిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ ఈ నెల 22న కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టగా ఆదివారం గ్రామ శివారులోని బావిలో పిచ్చమ్మ(63) శవమై కనిపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మహిళ హత్యకు గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకొని పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

హైడ్రాలిక్ క్రేన్ తగిలి బాలుడు మృతి

ప్రేమ్‌కుమార్(ఫైల్)

కొండమల్లేపల్లి, మార్చి 24 : ఇంటి ముందు ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చిన బాలుడిని అటుగా వెళ్తున్న హైడ్రాలిక్ క్రేన్ తగలడంతో బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని బాపూజీనగర్ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామునిగుండ్లకు చెందిన రమావత్ బాలూనాయక్- పార్వతి దంపతులు మూడేండ్లుగా బాపూజీనగర్‌లో నివాసముంటున్నారు. తల్లి పార్వతి కిరాణా షాపు నిర్వహిస్తుండగా తండ్రి బాలూనాయక్ సంతలో మేకలు, గొర్ల కమీషన్ వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం కావడంతో అప్పుడే సంతలో వ్యాపారం ముగించుకొని ఇంటికి వస్తుండగా కుమారుడు ప్రేమ్‌కుమార్(2)ఎదురుగా రావడంతో ఎత్తుకుని ముద్దాడి ఇంట్లోకి వెళ్లాడు. రోజు మాదిరిగానే ఇంటి ముందు ఆడుకుంటాడులే అనుకున్న తల్లిదండ్రులు సంతలో జరిగిన వ్యాపారం గురించి మాట్లాడుకుంటుండగా ఈ ఘటన జరిగింది. ప్రేమ్‌కుమార్ రోడ్డు పక్కన ఆడుకుంటుండగా దేవరకొండ నుంచి కొండమల్లేపల్లికి వస్తున్న హైడ్రాలిక్ క్రేన్ బాలుడిని బలంగా ఢీకొట్టింది. దాంతో బాలుడి తల పగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అప్పుడే తన సంక నుంచి దిగిన కుమారుడు పది నిమిషాల్లోనే మృత్యువాత పడడంతో బాలుడి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుడి తండ్రి బాలూనాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నటుల ఎస్ఐ తెలిపారు.

చిట్యాలలో కామదహనం

కామ దహనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చిట్యాల, మార్చి 24 : మున్సిపాలిటీలోని బొడ్రాయి వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన కామ దహనం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ముందస్తుగా హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సహజ సిద్ధమైన సంప్రదాయ రంగులతో హోలీ జరుపుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, కులవృత్తుల వారు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య

నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య

మాడ్గులపల్లి, మార్చి 24 : గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి దుర్గయ్య సూచించారు. ఆదివారం మండలంలోని ఇందుగుల గ్రామంలోని ఇండ్లకు వెళ్లి నీరు నిల్వ ఉన్న వస్తువులను గుర్తించి పారబోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వ వల్ల దోమ లార్వాలు వృద్ధి చెందుతాయని, ఆ నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకొని బ్లీచింగ్ చల్లుకోవాలని సూచించారు. గ్రామంలో ఒళ్లు నొప్పులు, జ్వరం ఉన్న వారిని పరిశీలించి మందులను అందజేశామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా నివారణ బృందం సభ్యుడు రవికుమార్, డాక్టర్ ఫిర్దోస్, ఏఎన్ఎం భవాని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాతి కడీలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

కట్టంగూర్, మార్చి 24 : భూమి చుట్టూ పాతిన రాతి కడీలను ధ్వంసం చేసిన వ్యక్తిపై కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ మండలం ఎల్లంబావికి చెందిన కె.రవీందర్‌రెడ్డి కుటుంబానికి మండలంలోని ఈదులూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల భూమి ఉంది. హైదరాబాద్‌కు చెందిన ఆర్.కొండల్‌రెడ్డి భూ తగాదాలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 21న తన అనుచరులతో కలిసి రవీందర్‌రెడ్డి భూమి చుట్టూ పాతిన 1,500 కడీలను ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొండల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శాలిగౌరారం, మార్చి 24 : జీవితంలో మనం ఏ స్థాయికి ఎదిగినా, ఉన్నత స్థానాలు అధిరోహించినా తొలిమెట్టు లాంటి పాఠశాలను మరువొద్దని ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు సూచించారు. మండలంలోని గురజాల జడ్పీహెచ్‌ఎస్‌లో 2002-03 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమౌళి, సాంబయ్య, అశోక్, రాంరెడ్డితోపాటు పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు గన్నపురెడ్డి అనిల్ కుమార్, గంధ్రాతి స్వాతి, నాగయ్య, సైదులు, శ్రీశైలం, గంగమల్లు, మంగా పాల్గొన్నారు.

సమ్మేళనంలోపాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు